క్లుప్తంగా

5% పన్ను రాయితీని సద్వినియోగంచేసుకోవాలి

పార్వతీపురంటౌన్: 5% పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్ను ఏక మొత్తంలో చెల్లించే వారికి ప్రభుత్వం 5% పన్ను రాయితీని కల్పించనుందని చెప్పారు. ఈ సదవకాశం ఈనెల 30వ తేదీ వరకు ఉందని, కావున పురప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పన్ను చెల్లింపుదారులు పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో గాని, సచివాలయాలు, మీ–సేవా కేంద్రంలో గాని పన్ను చెల్లించి రశీదును పొందాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలనుకున్నవారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీడీఎంఏ.ఏపీ.జీఓవీ.ఇన్ పేమెంట్ ఆప్షన్‌లో చెల్లించే వెసులుబాటు కల్పించామని వివరించారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం కూడదు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనందరావు

పార్వతీపురం టౌన్: ఎన్నికల విధుల్లో అలసత్వం వహించరాదని తహసీల్దార్ కె.ఆనందరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తమ పరిధిలో అప్పగించిన విధులను అంకితభావంతో చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఎంసీసీ ఉల్లంఘనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పని ప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో దేవకుమార్

మక్కువ: ఎండలు మండుతున్న సందర్భంగా ఉపాధి పనిప్రదేశం వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీవో ఈశ్వరమ్మను ఎంపీడీవో పి.దేవకుమార్ ఆదేశించారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి పనిప్రదేశం వద్ద వేతనదారులకు నీడ, నీరు, ప్రథమచికిత్స కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



తాటిశీల చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గుమ్మలక్ష్మీపురం: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీస్ ఉన్నతాధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల వేల ధన ప్రవాహం, పంపిణీ చేసేందుకు తరలించే కానుకల ప్రవాహంకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద కేంద్ర బలగాలతో కలిసి ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మండలంలోని ఆంధ్రా సరిహద్దు గ్రామమైన తాటిశీల వద్ద (గుణుపూర్ రోడ్డు) ఎల్విన్‌పేట పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టు వద్ద ఒడిశా నుంచి అక్రమంగా మద్యం, డబ్బు రాకుండా తనిఖీలు చేస్తున్నారు. రూ.50 వేలు మించి నగదు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు తీసుకు వెళ్తే వాటిని సీజ్ చేస్తున్నారు. సిప్పలవారిగా విధులు నిర్వహిస్తూ.. నిఘా పటిష్టం చేశారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పార్వతీపురం టౌన్: బాలికను మోసం చేసి శారీరకంగా లోబరుచుకున్న యువకుడిపై పోక్సో చట్టం కింద బుధవారం కేసు నమోదు చేసినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై దినకర్ తెలిపారు. కేసు వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలంలోని పుట్టూరు గ్రామానికి చెందిన యువతి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన పెంటకోట ప్రవీణ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ఫ్యాన్ ప్రభంజనం ఆపతరమా..!

- మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం పట్టణంలోని 22వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

పార్వతీపురంటౌన్: ఫ్యాన్ గాలిని ఆపే దమ్ము ఎవరికీ లేదని, మళ్లీ రాష్ట్రంలో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని 22వ వార్డులో బుధవారం ఆయన ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మళ్లీ తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతి, వారి సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. సీఎం జగనన్న ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కలిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకుంటూ ప్రజలకు మరింత సంక్షేమ లబ్ధి చేకూరుతుందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని స్పష్టం చేశారు.

నియోజకవర్గంలో 1.54లక్షల మందికి లబ్ధి

గడిచిన ఐదేళ్లలో పార్వతీపురం నియోజకవర్గానికి సంక్షేమ, అభివృద్ధి పనులకు రూ.1540కోట్లు ప్రభుత్వం అందజేసిందని గుర్తు చేశారు. మీ అందరి దీవెనలు, మద్దతు వైఎస్సార్‌సీపీకి అందించాలని కోరారు. ప్రతి గడప వద్ద ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలుకుతూ తమకు ఎంతగానో మేలు చేసిన ఈ ప్రభుత్వానికి కాక మరి ఇంకెవరికి మేము మద్దతు ఇస్తామని చెబుతూ మా అందరి పూర్తి సహాయ సహకారాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికేనని, మళ్లీ తమ కుటుంబాలన్నీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా జోగారావును, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించుకుంటామని ప్రజలంతా ఎమ్మెల్యే జోగారావును ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి పట్టంకట్టండి

బలిజిపేట: అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకు అతీతంగా లబ్ధిదారుల ఖాతాలకు సంక్షేమ ఫలాలను జమచేస్తున్న సంక్షేమ సారథి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని అంపావల్లిలో బుధవారం ఆయన ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయా? లేదా? అనేది ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి రావాలా? సంక్షేమ పథకాలు అందించని ప్రభుత్వం కావాలా? అని ప్రజలు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. 5సంవత్సరాల కాలంలో ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, సంక్షేమాన్ని క్రమం తప్పకుండా అందించిన సీఎం జగన్మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవాలని కోరారు. రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, ఉదయ్‌కుమార్, పి.రాజశేఖర్, పి.కురిమినాయుడు, బి.వాసు నాయుడు, ఎస్.సత్యనారాయణ, యమ్మల చిన అప్పారావు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, పార్టీ మండల మహిళా సంఘం అధ్యక్షురాలు దుర్గేశ్వరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బలిజిపేట: అంపావల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



సీతానగరం: ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి

సీతానగరం: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా, రాజకీయాలకు అతీతంగా నవరత్నాల పథకాలు అమలు చేసి ప్రతి కుటుంబానికి లబ్ధిచేకూరే పనులుచేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండవ పర్యాయం ముఖ్యమంత్రిని చేయడానికి ఓటరు దేవుళ్లంతా సహకరించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు సీతానగరం మండలకేంద్రంలోని మెట్టువీధి, రజక, కర్రోతు,దేవాంగుల వీధుల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పార్టీ కార్యకర్తలతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో సంక్షేమపథకాలు అందిపుచ్చుకున్న లబ్ధిదారులంతా ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నామన్నారు. ముందుగా మార్కెట్‌లో ప్రచారం నిమిత్తం వాహనం దిగిన వెంటనే వాసవీక్లబ్ ప్రతినిధులు ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు హారతిచ్చి విజయం సాధించాలని దీవించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఎంపీటీసీలు బురిడి కుసుమ, సురగాల గౌరి, మాజీ ఎంపీపీ కె రత్నాకర్, సచివాలయ కన్వీనర్లు ఎస్.రామారావు, ఎస్.రమేష్, బి.సూర్యనారాయణ, ఎస్.వెంకటరమణ, కిరణ్‌కుమార్, ప్రసాద్, వినోద్‌కుమార్, సోములు పాల్గొన్నారు.

తెరిచిన పుస్తకం రాజన్నదొర



సమావేశంలో మాట్లాడుతున్న మావుడి శ్రీనివాసరావు నాయుడు

- నాయకుడి కన్నా విలువైన వ్యక్తి కార్యకర్త
- మక్కువ జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు

సాలూరు రూరల్: నాలుగుసార్లు సాలూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఎన్నికై ఐదవసారి ఎమ్మెల్యేగా పోటీలో ఉండి తిరుగులేని నాయకుడిగా ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ప్రజాసేవకే అంకితమైన నాయకుడు పీడిక రాజన్నదొర తెరిచిన పుస్తకం వంటి వాడని మక్కువ మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు మావుడి రంగు నాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గంగన్న దొరవలస పామాయిల్ తోటలో సాలూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు సువ్వాడ భరత్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మచ్చలేని మన రాజన్న దొరకు ఎలాంటి వ్యాపారాలు, వ్యవహారాలు లేవన్నారు. వివాద రహితుడుగా పేరుసంపాదించి 24 గంటలు నియోజకవర్గం అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తి రాజన్నదొర అని ప్రశంసించారు. 2019 ఎన్నికల్లో 20వేల ఓట్లు పైగా ఆధిక్యంతో గెలుపొందిన ఆయనను ఇప్పుడు అంతకంటే ఎక్కువ మెజారిటీతో గెలిపించాల్సిన భాధ్యత మనందరిపైన ఉందన్నారు. పాచిపెంట మండల నాయకుడు డోల బాబ్జీ మాట్లాడుతూ రాజన్నదొరను గెలిపించుకుంటేనే ఇప్పుడు అందుకుంటున్న పథకాలు కొనసాగుతాయని లేదంటే ఇప్పుడు అందుకుంటున్న పథకాలు మరి అందవని హితవు పలికారు.

సరిహద్దు భద్రత కీలకం

- తహసీల్దార్ కె.ఆనందరావు



చెక్‌పోస్టును తనిఖీచేస్తున్న తహసీల్దార్ కె.ఆనందరావు

పార్వతీపురంటౌన్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో భద్రత కీలకమని తహసీల్దార్ కె.ఆనందరావు, అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురంలోని వెంకంపేట గోరీల వద్దగల చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాలో భద్రత కీలకమన్నారు. పక్కా రాష్ట్రం ఒడిశా నుంచి గంజాయి, సారా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై దృష్టిసారించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాలని కోరారు. ముఖ్యంగా ఎన్నికల నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం నుంచి డబ్బు రవాణాపై దృష్టిసారిస్తూ ముందస్తు సమాచారం సేకరించాలని సూచించారు. అనుమానం ఉన్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై సంతోషి, ఆర్‌ఐలు రామకృష్ణ, నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత గల పిల్లలపై దృష్టిసారించాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: రక్తహీనత కలిగిన పిల్లలపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ నిషాంత్ అధికారులను ఆదేశించారు. పదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు నివారణ కార్యక్రమం (ప్రాజెక్ట్ ఫర్ రిడక్షన్ ఆఫ్ ఇన్‌ఫాంట్ మోర్టాలిటీ రేట్ బిలో 10)పై వైద్యాధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బందితో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌ను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు నివారణపై దృష్టిసారించాలని ఆదేశించారు. తల్లి గర్భంనుంచే పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. గర్భం దాల్చిన వెంటనే గుర్తించి వారి పేర్లు నమోదు చేయాలని, గ్రామ స్థాయినుంచి పర్యవేక్షణ పక్కాగా ఉండాలని కోరారు. గర్భిణులు, బాలింతలు, రక్తహీనత కలిగిన వారు, బరువు తక్కువ, వయస్సుకు తగిన ఎత్తు లేకపోవడం తదితరులు పౌష్టికాహారం తినే విధంగా పర్యవేక్షించాలని సూచించారు. రక్తహీనత కలిగిన వ్యక్తికి ఒక దత్తత అధికారి ఉండాలని, ప్రతి దత్తత అధికారి నెలలో కనీసం మూడుసార్లు సందర్శించాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ హిమోగ్లోబిన్ పరీక్షలు చేయాలని, 30రోజులు పూర్తయితే మళ్లీ పరీక్షలు చేయాలన్నారు. మూఢ నమ్మకాలతో పౌష్టికాహారం తీసుకోని వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్సులో డీఎంహెచ్‌ఓ డా. బి.జగన్నాథ రావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డా.బి.వాగ్దేవి, డీఐఓ డా.నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.శివ శంకర్, ప్రోగ్రాం అధికారి డా.ఎం.వినోద్, డా.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఊట బావుల వద్ద నీటి రంగు మార్పు



మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: ఊట బావులవద్ద పనుల వల్ల నీటి రంగు మారుతోందని పార్వతీపురం మునిసిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తోటపల్లి నేల బావుల్లో క్రమం తప్పకుండా పూడికలు తీయిస్తున్నామన్నారు. తోటపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చిన నీరు ఊట బావుల వైపు వెళ్లేందుకు నదికి అడ్డంగా ఇసుకబస్తాలు వేస్తున్నట్లు చెప్పారు. తద్వారా నీరు కొద్దిగా రంగు మారుతోందన్నారు. నీటిని పూర్తిగా క్లోరినేషన్ చేసి సరఫరా చేస్తామని తెలిపారు. తోటపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చిన నీటికి ఇసుక బస్తాలు వేసి బావులవైపు నీరు మళ్లించడమే కాకుండా ఊట బావుల చుట్టూ కూడా ఇసుక బస్తాలు వేసి శుద్ధమైన నీరు బావుల్లో ఇంకేలా చర్యలు తీసుకుంటామన్నారు. పని పూర్తయిన పిదప శుభ్రమైన నీరు బావుల నుంచి తోడి బూస్టర్ పంప్‌హౌస్ వద్ద పూర్తిస్థాయిలో క్లోరినేషన్ చేసి రక్షిత నీరు ప్రజలకు సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

దివ్యాంగులకు ఇంటివద్దనే ఓటు వేసే అవకాశం

సీతానగరం: 2024 మే 13న జరగనున్న సాధారణ ఎన్నికల్లో దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వినియోగించుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందని, ఈ అవకాశాన్ని దివ్యాంగులు వినియోగించు కోవాలని పార్వతీపురం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ కె హేమలత కోరారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని చినభోగిలి గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్టార్ అధికారులు దివ్యాంగుల ఇంటికి వెళ్లి వారికి ఇంటివద్దనే ఓటుహక్కు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సెక్టార్ అధికారి ఎస్.అవినాష్, వీఆర్వో, బీఎల్వో పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌కు అనుమతి

2024 సాధారణ ఎన్నికల్లో సునాయసంగా ఓటును వినియోగించు కునేందుకు ఎన్నికల కమిషన్ కల్పించిన అవకాశాన్ని దివ్యాంగులైన ఓటర్లు వినియోగించుకోవాలని ఎన్నికల సెక్టోరల్ అధికారి కె.కుమావర్మ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని 126వ నంబర్ పోలింగ్ కేంద్రం బూర్జ పంచాయతీలోని ఆవాలవలసలో దివ్యాంగులకు ఫారం 12డిని వినియోగించుకునేందుకు బీఎల్వో దామోదర్ నాయుడుతో కలిసి ఫారాలను పంపిణీ చేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకుముందు దివ్యాంగులు ఓట్లు వినియోగించుకునేందుకు అవస్థలు పడాల్సి వచ్చేదన్నారు. అప్పట్లో దివ్యాంగులు పడుతున్న కష్టాలను పరిశీలించిన ఎన్నికల కమిషన్ 2024 సాధారణ ఎన్నికల నుంచి దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లువేసే సౌకర్యం కల్పించిందని చెప్పారు. బూర్జ, పెదంకలాం, సుమిత్రపురం, కృష్ణారాయపురం గ్రామాల్లో దివ్యాంగులను గుర్తించి 12డి ఫారాలు సమకూర్చవలసి ఉంటుందని తెలియజేశారు.

గిరిజన గ్రామాల్లో నిరంతర వైద్య సేవలు



దోకిశీల గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ ఐశ్వర్య

పార్వతీపురం టౌన్: గిరిజన గ్రామాల్లో నిరంతర వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి ఐశ్వర్య చెప్పారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని డొకిశీల గిరిజన గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 80 మంది రోగులకు బుధవారం ఆమె వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు నియమితులయ్యారని, ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు వారి ఇళ్ల వద్దే వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. గ్రామాల్లో దాదాపు 13 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని, 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నొస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 10 కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన పదాల వలస గ్రామస్తులు

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి పంచాయతీ పడాలవలస గ్రామానికి చెందిన 10 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరాయి. ఈ మేరకు గంగన్నదొర వలసలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం అనంతరం డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆధ్వర్యంలో కొట్టిశ బాలరాజు, రెడ్డి శ్రీను, కొట్టిశ నరశంగరావు, ఇల్లాపు దొర సీతారాం, వొలిసి బాలచంద్రరావు తదితరులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు తమ కుటుంబాలకు అందుతున్నాయని, పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమం అందిస్తున్న జగనన్న వెంట నడవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

కోదండరామ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

గరుగుబిల్లి: శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా కోదండరామాలయంలో బుధవారం ఉదయం శ్రీరామ సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, రుత్విక్ వరుణ తదితర పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ, లక్ష్మీమంత్ర జపములు, శ్రీమద్రామాయణ పారాయణం చేపట్టారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 17న శ్రీసీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

13న రామాలయ పునఃప్రతిష్ఠ

గరుగుబిల్లి: మండలంలోని కొంకడివరం పంచాయతీ సీతారాంపురం గ్రామంలో ఈనె 13న సీతారామ లక్ష్మణ ఆంజనేయ ఉత్సవ విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 12 సాయంత్రం నుంచి పూజా కార్యక్రమాలను ప్రారంభించి, 13న ఉత్సవ విగ్రహాల పునఃప్రతిష్ఠ, కల్పవృక్షం ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను అర్చకులు కె.మురళీమోహన్ శర్మ పర్యవేక్షణలో చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

రోగులకు పౌష్టికాహారం వితరణ



పెదంకలాం పీహెచ్‌సీలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ రాధాకాంత్

సీతానగరం: మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీలో వైద్య సేవల కోసం వచ్చిన రోగులకు బలిజిపేట మండలంలోని అజ్జాడ సత్యసాయి భక్తులు సమకూర్చిన పౌష్టికాహారాన్ని డాక్టర్ రాధాకాంత్ బుధవారం పంపిణీ చేశారు. ఈ మేరకు డాక్టర్ రాధాకాంత్ మాట్లాడుతూ అజ్జాడ గ్రామానికి చెందిన సత్యసాయి భక్తసమాజం కమిటీ సభ్యులు ప్రతి బుధవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తారని తెలియజేశారు. వైద్య సిబ్బంది సూచనల మేరకు అదే రోజు ఎంతమంది వైద్యసేవల నిమిత్తం రోగులు పెదంకలాం పీహెచ్‌సీకి వచ్చినా సత్యసాయి సేవా సమింతి తాజాగా సమకూర్చిన ఆహారాన్ని అందజేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.